# ఇరుకు

-రాచపూటి రమేష్

ఆ విషయం విన్నప్పటి నుంచి మాధవ్ మనసు మనసులో లేదు. ఎప్పుడెప్పుడా వార్తను తన అర్ధాంగి రాధ చెవిలో వేద్దామా అని అతని మనసు ఉవ్విళ్లూరుతోంది. ఆరో తరగతి నుండి ఇంటర్‌వరకు తనకు క్లాస్‌మేట్, బెంచిమేట్ అయిన ప్రశాంత్ మంచి మిత్రుడు. ఎంసెట్‌లో రాంక్ సంపాదించి ప్రశాంత్ బిటెక్‌లో చేరిపోయాడు. తానేమో డిగ్రీనే ఐదేళ్లు లాగించి రాష్ట్రప్రభుత్వంలోని ఓ పనికిమాలిన శాఖలో గుమాస్తాగా మిగిలిపోయాడు.

కడపలో పన్నెండేళ్లు పనిచేసిన తరువాత మాధవ్‌కి హైదరాబాద్‌లోని హెడ్డాఫీస్‌కు ట్రాన్స్‌ఫర్ అయింది. కూకట్‌పల్లిలోని ఓ కాలనీలో ఆరు చిన్న పోర్షన్లున్న కాంపౌండ్‌లో ఇల్లు అద్దెకు తీసుకున్నాడు.అగ్గిపెట్టెలాంటి ఆ ఇంటిలో భార్య, ఇద్దరు పిల్లలతో ఉండడం కష్టంగానే వుంది. హాలు, చిన్న వంటగది, ఇరుకైన బెడ్‌రూం. మంచం మీద పడుకుని కాళ్లు జాపుకుంటే గోడ తగిలేంత ఇరుకు. అసలే ఆరడుగుల మాధవ్‌కు ఆ ఇంటిలోని ఇరుకు చెప్పలేనంత చిరాకు కలిగిస్తోంది.

ఆరునెలల క్రితం కోఠీలో మాధవ్‌కు హఠాత్తుగా బాల్యమిత్రుడు ప్రశాంత్ తారసపడ్డాడు. మాధవ్‌ని చూసి రెక్కపట్టుకుని హోటల్లోకి లాక్కెళ్లాడు ప్రశాంత్. కాఫీ తాగుతూ బాల్యస్మృతులు నెమరు వేసుకున్నారు. తన విజిటింగ్ కార్డు ఇచ్చి ఆదివారం తప్పకుండా తన ఇంటికి సతీసమేతంగా రమ్మని ఆహ్వానించాడు.

మరుసటిరోజు కాస్త ఖాళీ దొరకడంతో ప్రశాంత్ ఇంటికి వెళ్లాడు మాధవ్. ఆ ఇంట్లోకి అడుగుపెట్టగానే అతనికి మతి పోయినట్లయింది. లేటెస్ట్ మోడల్ ఇంపోర్టెడ్ ఫర్నిచర్, కూర్చుంటే మాసిపోతుందా అనిపించే సోఫాసెట్, షాండ్లియార్స్, సెంట్రలైజ్డ్ ఏసీతో ఇంద్రభవనాన్ని తలపిస్తోంది ప్రశాంత్ ఇల్లు. రెండే పడక గదులున్నా అందులోని వస్తువులు ఎక్కడివక్కడ పొందిగ్గా సర్ది ఉన్నాయి. ప్రశాంత్ భార్య సింధు చక్కటి మర్యాదలు చేసింది. రెండుగంటలపాటు మిత్రులిద్దరూ చదరంగం ఆడుతూ కూర్చున్నారు. సమయం ఎలా గడిచిపోయిందో అస్సలు గుర్తుకు రాలేదు మాధవ్‌కి.

అప్పటి నుండి ఇద్దరు మిత్రుల మధ్య రెగ్యులర్‌గా రాకపోకలు ప్రారంభమయ్యాయి. కొద్దిరోజుల్లోనే నెలకో ఆదివారమైనా భార్యా పిల్లలతో కలసి ప్రశాంత్ మాధవ్ ఇంటికి, మాధవ్ ప్రశాంత్ ఇంటికి వెళ్లడం పరిపాటయింది.

★★★

ఆ రోజు సాయంత్రం ఆఫీసులో ఫైళ్లు కట్టేసి ఇంటికి వెళ్లే హడావుడిలో వున్న మాధవ్‌కు ప్రశాంత్ నుండి ఫోనొచ్చింది. సాయంత్రం గ్రీన్ పార్క్ హోటల్లో కలుసుకోమన్నాడు ప్రశాంత్. తనతో ఏదో విషయం మీద అర్జంట్‌గా మాట్లాడాలిట. ప్రశాంత్ తనతో మాట్లాడాల్సిన విషయం ఏమై వుంటుందా అని ఆలోచిస్తూ హోటల్‌కు చేరుకున్నాడు. పావుగంట తరువాత ప్రశాంత్ వచ్చాడు. అతను ఏదో ఆలోచిస్తున్నట్లు సీరియస్‌గా ఉన్నాడు. బేరర్‌కి కాఫీ ఆర్డరిచ్చి తన పరాకుకు కారణం వివరించాడు ప్రశాంత్.

"మాధవ్! నేను కంపెనీ పనిమీద రెండేళ్ల పాటు ఇటలీకి వెళ్లే అవకాశం లభించింది. కానీ నాకో పెద్ద సమస్య వేధిస్తోంది'' అన్నాడు.

"కంగ్రాట్స్... నీకేం సహాయం కావాలన్నా చేసేందుకు నేను రెడీగా ఉన్నాను'' అన్నాడు మాధవ్ ఆనందంగా.

"నిజానికి నేనే నిన్ను సహాయం అడగాలనుకుంటున్నాను. రెండేళ్ల తరువాత ఎలాగూ నేను ఇక్కడకు రావాల్సిందే. మేముంటున్నది మంచి లొకాలిటీ. అందులో అన్ని వసతులున్న మంచి ఇల్లు దొరకడం చాలా కష్టం. ఇల్లు ఖాళీ చేస్తే మళ్లీ అంత మంచి ఇల్లు దొరకదు'' అన్నాడు ప్రశాంత్.

"ఇళ్లకేం ఇంతకన్నా మంచి కాలనీలో ఇంతకన్నా మంచి ఇల్లే దొరుకుతుంది'' అన్నాడు మాధవ్.

"కానీ ఇది నాకు సెంటిమెంట్‌గా అచ్చొచ్చిన ఇల్లు. నాదొక రిక్వెస్ట్. ఈ ఇంటిని వెకేట్ చేయడం నాకెలాగూ ఇష్టం లేదు. నేను తిరిగి వచ్చేవరకు నువ్వు నీ కుటుంబంతో ఈ ఇంట్లోనే వుండండి. ముఖ్యమైన వస్తువులు మాత్రమే మేం తీసుకెళ్తాం. మా ఫర్నిచర్ కూడా మీరు వాడుకోవచ్చు'' అన్నాడు ప్రశాంత్.

మాధవ్ ఖంగుతిన్నాడు. తన వంటి చిరుద్యోగి ఇంత ఇంటి అద్దెను భరించగలడా? ఆమాటే చెప్పాడు ప్రశాంత్‌తో.

"నాకామాత్రం తెలియదా? ఇప్పుడు మీరున్న ఇంటికి ఎంత రెంట్ పే చేస్తున్నారో అంతే నాకు ఇవ్వు. అదీ ఇప్పుడు కాదు. నేను ఇటలీ నుండి తిరిగివచ్చిన తరువాత'' రిక్వెస్ట్‌గా అడిగాడుప్రశాంత్. మిత్రుడి మాట కాదనలేకపోయాడు మాధవ్. నెలసరి అద్దె ఏ బ్యాంకులోనైనా కడితే ప్రశాంత్ వచ్చిన తరువాత డ్రా చేసి ఇవ్వవచ్చు. ఇరుకింట్లో అవస్థలు పడుతూ సర్దుకునే సమస్య తప్పుతుంది. రెండేళ్లల్లో తనకెలాగూ ప్రమోషన్ రావచ్చు. అప్పుడు మరో ఇంట్లో చేరిపోతే పోతుంది. ఈ విషయం ఇంటికి వెళ్లిన తరువాత రాధకు చెప్పాడు. ముందు కొంత సందేహించినా తరువాత సంతోషించింది. విషయం విన్న పిల్లలు ఎగిరి గంతేసారు.

నెలరోజుల్లో ప్రశాంత్ తన ఇంటిని ఖాళీచేసి భార్యాపిల్లలతో ఇటలీ వెళ్లిపోవడం, అదే ఇంట్లో మాధవ్ చేరిపోవడం జరిగిపోయాయి.

పెద్ద పెద్ద గదులు, ధారాళమైన గాలీ వెలుతురు, ఇంట్లో ఖరీదైన సోఫాలు... రాధను, పిల్లలను బాగా ఆకట్టుకున్నాయి. ఇంటి ముందున్న లాన్‌లో పిల్లలు ఆనందంగా ఆడుకోసాగారు.

స్కూటర్ ఉండడంతో ఆఫీసు కొద్దిగా దూరమైనా వెళ్లి రావడం కష్టంకాదు అనుకున్నాడు మాధవ్. మంచినీళ్లకోసం ఇక ఉదయం ఐదిం

టికే లేవనవసరం లేదనుకుంది రాధ.

***

మరుసటిరోజు ఉదయమే పాలపేకెట్లు తీసుకురమ్మని మాధవ్‌ని నిద్రలేపింది భార్య. చెప్పులు వేసుకుని వీధిలోకి వచ్చాడు మాధవ్.

లుంగీ, షర్టుతో వెళ్తున్న మాధవ్‌ను వింతగా చూసారు మార్నింగ్ చేస్తున్న ఆ కాలనీ ధనికులు. కిలోమీటరు వెళ్తేగానీ పాలపేకెట్లు దొరకలేదు.

రెండురోజుల తరువాత ఇంటి ఓనరు భార్య రాజేశ్వరమ్మ వాళ్లను చూడడానికి వచ్చింది.

"ఏవమ్మా! అంతా ప్రశాంత్ వాళ్ల ఫర్నిచరే కనిపిస్తోంది. మీ వస్తువులేమీ లేవా?" మాటల సందర్భంలో అడిగింది.

రాధకు తల కొట్టేసినట్టయింది. ఖరీదైన ఫర్నిచర్ మధ్య తమ పాత ఇంటిలోని కుర్చీలు, బల్లలు వేస్తే బాగుండదని అటకమీద వేయించింది రాధ. ఆ మాట రాజేశ్వరమ్మకు చెప్పలేకపోయింది. ఆదివారమైతే వాళ్లిద్దరికీ ఆ ఇంట్లో తెగ బోరు కొడుతోంది.

తమ పాత ఇంట్లో అన్ని పోర్షన్ల వాళ్లు తమ ఇంటికి అడపాతడపా వస్తూ కబుర్లు చెప్పేవారు. కొందరు పిల్లలు ఇంటి సామగ్రి ఏమైనా కావాలంటే తెచ్చి పెట్టేవారు. ఇక్కడ ఆ వూసేలేదు. పక్కింటి ఆడవాళ్లను రాధ పలకరించినా మూతి ముగించుకుని ముక్తసరిగా సమాధానాలిచ్చేవారు. బహుశా అంతస్తులో తమకన్నా రాధా వాళ్లు చాలా తక్కువ వున్నారన్న చులకన కావచ్చు.

ఆగర్భ శ్రీమంతులున్న ఆ ఏరియాలో తమలాంటివారు చేరడం పొరపాటేనని త్వరలోనే తెలిసిపోయింది ఆ భార్యాభర్తలిద్దరికీ. కనీసం పలకరించే దిక్కులేదు, ఒంటరివాళ్లమైనామన్న ఫీలింగ్ ఎక్కువ బాధిస్తోంది వాళ్లను.

పిల్లలకు కూడా పక్క ఇళ్లల్లోని పిల్లలు స్కూలుకు ఎప్పుడు వెళ్తారో, ఎప్పుడు వస్తారో తెలియదు. పలకరించినా పెద్దగా మాట్లాడరు. ఆదివారమైతే టీవీతోనే కాలక్షేపం చేయాలి. అదే తమ పాత ఇంట్లోనైతే పిల్లలంతా ఒక జట్టుగా సమీపంలోని ప్లేగ్రౌండ్‌కు వెళ్లి ఆడుకునేవారు. పండుగలు, పబ్బాలు కలిసి జరుపుకునేవారు. ఎదురుగావున్న ఇంటిలోని పిల్లలు ఓసారి హడావుడిగా వీళ్ల ఇంటికొచ్చారు.

"మా సిస్టమ్ చెడిపోయింది. మీ ఇంట్లోని కంప్యూటర్‌లో కాసేపు వర్క్ చేసుకోవాలి" అన్నారు.

"మా ఇంట్లో కంప్యూటర్‌లేదు" చెప్పింది రాధ. వాళ్లు గిరుక్కున తిరిగి ఇంటిలోకి వెళ్లిపోయారు. వారామాట వాళ్లమ్మతో చెప్పడం, ఆమె నవ్వడం రాధకు కనిపిస్తూనే వుంది.

ఏడాదికాలం అతికష్టంమీద గడిచింది.

'మిత్రుడికి ఇచ్చిన మాట నిలుపుకోవడం కష్టంగా ఉంది. ఇరుకింట్లోనైనా సర్దుకుపోవచ్చు. ఇరుకు మనస్తత్వాల మధ్య అడ్జస్ట్ అవడం చాలా కష్టం' అనుకున్నాడు మాధవ్. ఇల్లు ఖాళీ చేయాలనే నిర్ణయానికి వచ్చాడు మాధవ్. అతని ప్రపోజల్‌కు రాధ ఆనందంగా ఒప్పుకుంది. 'మన పాత ఇంటికే వెళ్లిపోదాం నాన్నా' అన్నారు పిల్లలిద్దరూ. ఆ రోజు తన పాత ఇంటికి వెళ్లి మాట్లాడి వచ్చాడు మాధవ్. ఆరు పోర్షన్లలో ఒకటి నెలాఖరుకు ఖాళీ అవుతుందిట.

ఈ విషయం ప్రశాంత్‌కు ఎలా చెప్పాలా అని తర్జనభర్జన పడసాగాడు మాధవ్. అనుకోకుండా పదిరోజుల తరువాత ప్రశాంత్ నుండే ఫోన్ వచ్చింది.



"మాధవ్! మాకు కంపెనీ వారిచ్చిన అసైన్‌మెంట్ పూర్తయింది. ఇంకో ప్రాజెక్ట్ ఇప్పట్లో వచ్చేలాలేదు. వారం పదిరోజుల్లో నన్ను తిరిగి రమ్మని కంపెనీ ఆదేశించింది. నిన్ను ఇబ్బంది పెట్టను. ఇంకో ఏడాదిపాటు మీరు మా ఇంట్లోనే వుండవచ్చు. నేను వచ్చినా మరో ఇల్లు ఓ ఏడాదికి అద్దెకు తీసుకుంటాను" చెప్తున్నాడు ప్రశాంత్.

"అక్కర్లేదురా. మీరు వచ్చేసరికి ఇంటిని నీకు హేండోవర్ చేస్తాను. ఇంత మంచి ఇంట్లో [illegible] రోజులపాటు ఉండే అవకాశమిచ్చినందుకు చాలా థాంక్స్" నవ్వుతూ చెప్పాడు మాధవ్.

★